

పోలీస్ వ్యాన్‌లో మాజీ మంత్రి జోగి రమేశ్

హైడ్రామా!

నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్‌ను అనేక నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. తొలుత ఈ సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. ఇబ్రహీంపట్నం, సమీప పోలీస్ స్టేషన్ల నుంచి అధికారులు, సిబ్బందిని నగరానికి పిలిచి వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సెర్చ్ వారెంట్‌తో జోగి ఇంటికెళ్లారు. రెండు గంటల పాటు విచారించి అనంతరం అరెస్టు చేస్తున్నట్టు చెప్పారు. దీంతో వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని కొద్దిసేపు ఆందోళన చేశారు.

జోగి అరెస్టు ఆపరేషన్‌లో ఇబ్రహీంపట్నం పోలీసులకు కళ్లెం

తెల్లవారుజామున విజయవాడ పిలిపించి సెల్‌ఫోన్లు స్వాధీనం

- ఆ తర్వాత జోగి ఇంటికి వెళ్లిన పోలీసులు
- ఇబ్రహీంపట్నం అంతా పక్కా ప్రణాళికతో దిగ్బంధం
- పార్టీ శ్రేణులను రప్పించి ఆందోళన చేయించేందుకు జోగి ప్రయత్నం
- జోగి రమేశ్, రాము ఇళ్లల్లో 8 గంటలకుపైగా సోదాలు
- గవర్నమెంట్ ఆస్పత్రి వద్ద వైసీపీ శ్రేణుల వీరంగం

పక్కా ప్రణాళికతో ముందుకు..

గుట్టు చప్పుడు కాకుండా జోగి అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకు సిట్ అధికారులు పెద్ద హైడ్రామానే నడిపారు. ఇబ్రహీంపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న పోలీస్‌స్టేషన్లలోని సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్స్‌ను ఆదివారం తెల్లవారుజామునే విజయవాడలోని ఒక పోలీస్‌స్టేషన్‌కు పిలిచి వారి దగ్గర ఉన్న సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. జోగి ఇంటికి అరెస్టుకు వచ్చిన తర్వాత కాని వారికి వారి సెల్‌ఫోన్లు ఇవ్వలేదు. నేరుగా జోగిని అరెస్టు చేస్తున్నట్లు వెల్లడి చేయకుండా తొలుత జోగి అనుచరుడు ఆరేపల్లి రామును అరెస్టు చేస్తున్నట్లు లీకులిచ్చారు. దీంతో అందరి దృష్టిని మరల్చారు. జోగిని కాదు అరెస్టు చేసేది అతని అనుచరుడ్ని అని సోషల్ మీడియాల్లో పోస్టులు పెట్టారు. అందరి దృష్టిని కొంత సేపు మరల్చి జోగి రమేశ్, అతని సోదరుడు జోగి రామును సిట్ అధికారులు అరెస్టు చేశారు. కాగా, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జోగి రాజీవ్ కాలర్ పట్టుకున్నారంటూ వైసీపీ శ్రేణులు వీరంగం వేస్తూ అద్దాలు పగులగొట్టారు.

అరెస్టు తర్వాత విస్తృతంగా సోదాలు



జోగి సోదరుడు రాము ఇంటి వద్ద సోదాలు

జోగి రమేశ్, అతని సోదరుడు జోగి రామును అరెస్టు చేసిన అధికారులు ఆ తర్వాత వారి ఇళ్లలో విస్తృతంగా సోదాలు చేశారు. కల్తీ మద్యం కేసులో ఏ-1 ముద్దాయి అద్దేపల్లి జనార్దనరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా సిట్, ఎక్సైజ్, ఫోరెన్సిక్ అధికారులు జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము ఇళ్లలో సుమారు ఎనిమిది గంటల పాటు సోదాలు నిర్వహించారు. అణువణువు గాలించారు. ల్యాప్ టాప్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ఇతర పరికరాలను పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఏమైనా అక్రమాలకు పాల్పడి ఉంటారా అనే అంశాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం): నకిలీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టు నేపథ్యంలో ఆదివారం ఉదయం హైడ్రామా నడిచింది. తెల్లవారుజామున 4.30 గంటలకు ఇబ్రహీంపట్నం బయలుదేరిన పోలీసులు ఐదు గంటలకు రింగ్ సెంటర్ సమీపంలోని ఆయన ఇంటికి చేరుకున్నారు. బయట భారీ గేట్లు వేసి ఉన్నాయి. ఆటోమేటిక్ గేట్లు దాటి పోలీసులు ఇంటి లోపలికికి వెళ్లటానికి కొద్దిసేపు ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న వాళ్లకు సెర్చ్ వారెంట్ అందిస్తామని సమాచారం ఇవ్వటంతో పరిమితంగా పోలీసులను లోపలికి అనుమతించారు. దిగువన భారీ సంఖ్యలో పోలీసులు ఉండటంతో జోగి రమేశ్, ఆయన కుటుంబ సభ్యులకు అరెస్టు చేస్తారనే



పోలీసులు ఇచ్చిన పత్రాలపై సంతకం చేస్తున్న రమేశ్

అనుమానం వచ్చింది. దీంతో జోగి రమేశ్ తన అనుచరగణాన్ని రప్పించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సెర్చ్ వారెంట్ చూసే క్రమంలో కొంత జాప్యం చేశారు. ఆ తర్వాత పోలీసులు జోగి రమేశ్, ఇతర కుటుంబ మిగతా 6లో..



ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్ ఇంటి వద్ద హడావిడి

భారీ బందోబస్తు

జోగి రమేశ్ అరెస్టు నేపథ్యంలో మైలవరం నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం వైపు వచ్చే వాహనాలను పూర్తిగా పరిశీలించారు. జీ కొండూరు వై జంక్షన్ వద్ద పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అలాగే అన్ని వైపుల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎవరైనా ఇబ్రహీంపట్నం వైపు వస్తుంది లేనిది పరిశీలించారు. పోలీసులు బందోబస్తు తప్ప జోగి అరెస్టు ప్రభావం మైలవరం నియోజకవర్గంలో పెద్దగా కనిపించలేదు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఏ ఒక్క మండలంలో కూడా జోగికి మద్దతుగా ధర్నా, రాస్తారోకోలాంటివి కాని, రోడ్లపై బైటాయించడం వంటి ఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమాల్లో జోగుతూ..

- నకిలీ మద్యం కేసులో అరెస్టుతో జోగికి మకిలి!
- కల్లు, సారా తయారీలో జోగి, అద్దేపల్లి కుటుంబాల ఉమ్మడి భాగస్వామ్యం
- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని గట్ల గౌరవరంలో సారా తయారీ
- ఇబ్రహీంపట్నం ఫెర్రీలో విక్రయాలతో ఉమ్మడి వ్యాపారం
- జోగి నుంచి సహాయ సహకారాలు లభించాయని జనార్దనరావు ఆరోపణలు
- తొలినుంచీ ఎమ్మెల్యేగా, మంత్రిగా అరాచకం

6

తిరువూరు రాజకీయాలపై ఉత్కంఠ



ఎంపీ, ఎమ్మెల్యే మధ్య విభేదాలు



- రేపు టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందుకు ఇద్దరు నేతలు
- ఏం జరుగుతుందోనని సర్వత్రా ఆసక్తి

తిరువూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన ఎమ్మెల్యే, ఎంపీలు విడివిడిగా టీడీపీ క్రమశిక్షణా కమిటీ ముందు హాజరు అవుతున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో.. ఏం జరగబోతుంది.. ఇప్పటి వరకు జరిగిన పరిణామాలు ఎవ్వరికి లబ్ధి చేకూరుస్తాయి అనే అంశంపై పట్టణంలో చర్చజరుగుతోంది. ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నలిగిపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పార్టీలో కొందరు వర్గాలుగా విడిపోయి, కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో, మరికొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎందుకొచ్చిన తంటా అంటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత నియోజకవర్గంలో భారీ మెజార్టీతో టీడీపీ గెలుపొందినా.. ప్రస్తుత పరిణామాలు కార్యకర్తల్లో నిరాశ కల్గిస్తున్నాయి. పార్టీ కమిటీల నియామకం నేపథ్యంలో చెలరేగిన వివాదం ప్రస్తుతం తీవ్ర తుఫానుగా మారి పార్టీలో వర్గపోరుకు ఆజ్యం పోసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టీడీపీ కమిటీల్లో రెండు వర్గాలుగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇటీవల పార్టీ అధిష్టానం ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా ఎవ్వరి పని వారు చేసుకోవాలని సూచించింది. అయినా కొందరు ఆరోపణలు కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అపార నష్టం!

- పంటలు కోల్పోయిన 56,040 మంది రైతులు
- 1,416.22 హెక్టార్లలో ఉద్యాన పంటలకు రూ.73.45 కోట్ల నష్టం
- దెబ్బతిన్న 528 గృహాలు, కూలిన 33 పశువుల పాకలు
- విద్యుత్‌శాఖకు రూ.6.36 కోట్ల నష్టం
- చెట్లు విరిగిపడి ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు

జిల్లాలో 212 గ్రామాలపై మొంథా తుఫాను ప్రభావం

46,357 హెక్టార్లలో దెబ్బతిన్న వరి, ఇతర పంటలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మొంథా తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపింది. జిల్లాలోని 212 గ్రామాలపై తుఫాను ప్రభావం చూపిందని పేర్కొంది. తుఫాను తీరందాటే సమయంలో జిల్లాలోని పలు రహదారులపై కూలిన చెట్లను ఎప్పటికపుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తొలగించామని, విద్యుత్ సౌకర్యాన్ని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నామని నివేదికలో స్పష్టం చేసింది.

దెబ్బతిన్న పంటలు

జిల్లాలోని 427 గ్రామాల్లో వరి, ఇతర పంటలు 46,357 హెక్టార్లలో దెబ్బతిన్నట్లుగా అధికారులు గుర్తించారు. పాలుపోసుకునే దశలో, కోతకు సిద్ధంగా ఉన్న వరి 45,040 హెక్టార్లలో దెబ్బతిన్నట్లుగా నివేదికను పంపారు. వేరుశనగ 288.2 హెక్టార్లు, మినుము 985 హెక్టార్లు, పత్తి 43 హెక్టార్లు, మొక్కజొన్న నాలుగు హెక్టార్లు మొత్తంగా 46,357 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లుగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. 2,229 మంది రైతులకు చెందిన ఉద్యాన పంటల్లో అరటి, కంద, తమలపాకు, కూరగాయల తోటలు 1,416.22 హెక్టార్లలో దెబ్బతిన్నట్లుగా నివేదికను తయారు చేశారు. ఉద్యాన పంటలకు రూ.73.45 కోట్ల మిగతా 6లో..



మచిలీపట్నం మండలం అరిసేపల్లిలో నేలవాలిన వరిపంట

528 గృహాలకు నష్టం

తుఫాను గాలుల తీవ్రతకు జిల్లాలో మొత్తంగా 528 గృహాలు నాశనం అయినట్టు అధికారులు గుర్తించారు. ఇందులో 39 గృహాలు పూర్తిగా దెబ్బతినగా, మిగిలినవి పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు నివేదికను తయారు చేశారు. మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, పెడన బంటుమిల్లి, పమిడిముక్కల, కోడూరు, మోపిదేవి తదితర మండలాల్లో రూ.1.15 కోట్ల మేర నష్టం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు.

అవయవ దానంతో నలుగురు జీవితాల్లో వెలుగు

- బ్రెయిన్ డెడ్ అయిన గుడివాడ వాసి
- అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



హరి విజయ్ కుమార్ (ఫైల్)

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. అందరి హృదయాల్లో సజీవంగా నిలిచారు. గుడివాడకు చెందిన చిరు వ్యాపారి, జనసేన కార్యకర్త గుడివాడ హరి విజయ్‌కుమార్ (46) అక్టోబరు 30వ తేదీన మంగళగిరిలో బ్యాంకు పని నిమిత్తం వెళ్లారు. అక్కడే ఆయనకు ఫిట్స్ రావడంతో స్థానిక వైద్యశాలకు తరలించారు. బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావమైందని, మెరుగైన చికిత్స నిమిత్తం మణిపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. విజయకుమార్ సతీమణి యోగా విష్ణుప్రియ, కుటుంబసభ్యుల అంగీకారంతో అవయవదానం చేశారు. మూత్రపిండం, కాలేయం మణిపాల్ ఆస్పత్రికి అందజేయగా, అవసరమైన వారికి అవయవ మార్పిడి నిర్వహించారు. కిడ్నీలను విజయవాడ కామినేని ఆసుపత్రికి, నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రికి అందజేశారు. మరణించిన తర్వాత కూడా మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన విజయకుమార్, ఆయన కుటుంబసభ్యులను పలువురు ప్రశంసించారు.

కలుషిత నీరే దిక్కు!

తాగునీటిలో కలుస్తున్న ఎన్టీటీపీఎస్ బూడిద నీరు

బూడిద నీరు కలిసే దిగువ భాగంలో పంపు హౌస్

- ఎగువకు పంపుహౌస్ మార్పు అనివార్యం
- ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్టీటీపీఎస్ అధికారుల మధ్య సమన్వయలోపం
- ఆర్డీవో ఆదేశాలు ఇచ్చినా చర్యలు శూన్యం



చన్నీళ్ల కాలువ కట్టపై ఉన్న పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో కావూరి చైతన్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి: స్వచ్ఛమైన కృష్ణాజలాల కోసం సుమారు 143 గ్రామాల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి సరఫరా అవుతున్న కృష్ణా జలాల్లో స్వచ్ఛత ఏనాడో కనుమరుగయ్యింది. ఇప్పుడు ప్రజలకు అందుతుంది డాక్టర్ ఎన్టీటీపీఎస్ బూడిద అవశేషాలు కలిసిన కలుషిత జలాలు. దీంతో వాటి సహజ రుచి కోల్పోవడమే కాక అవి తాగిన ప్రజల ఊపిరి తిత్తులు, ఇతర అవయువాలు మిగతా 6లో..



మహిళల క్రికెట్ ప్రపంచ కప్పు ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం భారీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి మ్యాచ్‌ను వీక్షించారు. ఉత్కంఠ పోరులో భారత జట్టు విజయం సాధించడంతో మువ్వన్నెల జెండాలతో సందడి చేశారు.

వైభవంగా పాండురంగ స్వామి రథయాత్ర

చిలకలపూడిలోని పాండురంగ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రథయాత్ర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగర ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి



జరబల మంగ్యా (ఫైల్)

ఎ.కొండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి చెందిన ఘటన ఎ.కొండూరు మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మండలంలోని కృష్ణారావు పాలెం శివారు దీప్లానగర్ తండాకు చెందిన జరబల మంగ్యా (45) ఐదేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి బారిన పడ్డాడు. వైద్యుల సూచన మేరకు మందులు వాడాడు. వ్యాధి తీవ్రత పెరగడంతో డయాలసిస్ చేయించుకొంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మృతి చెందాడు. ఆరెకరం భూమి అమ్మి వైద్యం చేయించిన ఫలితం దక్కలేదని మృతుని భార్య కుమారి కన్నీరు పెట్టుకున్నారు. కాగా, మట్టి ఖర్చులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి టీడీపీ నేతలు పిన్నమనేని శ్రీనివాసరావు, పీక్లా నాయక్ అందజేశారు.



నడకుదురు పృథ్వీశ్వరక్షేత్రంలో చాగంటి కోటేశ్వరరావుతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, రవీంద్ర కుటుంబసభ్యులు

ప్రాచీన క్షేత్ర అభివృద్ధి అభినందనీయం

» నడకుదురు పృథ్వీశ్వరుని దర్శించిన చాగంటి

చల్లపల్లి/ఘంటసాల/కూచిపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నరకాసుర సంహార క్షేత్రంగా ఖ్యాతి గడించిన పృథ్వీశ్వర స్వామి క్షేత్రాన్ని అభివృద్ధిచేయటం గొప్ప విషయమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రశంసించారు. ఆదివారం నడకుదురులోని పృథ్వీశ్వరస్వామి దేవాలయాన్ని శిష్యబృందంతో కలిసి ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర, రమణకుమారి దంపతులు, డాక్టర్లు యార్లగడ్డ మధుకిరణ్, మండవ సింధూర, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు)లు చాగంటికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. స్వయంభూ పృథ్వీశ్వరస్వామిని, పాటలీవనాలను, లక్ష్మీనారాయణులను దర్శించుకుని పాటలీవనం ఆవరణలో మారేడు మొక్కను నాటారు. ఈ సందర్భంగా మండవ రవీంద్ర దంపతులను అభినందించి సత్కరించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల శివరామకృష్ణ, నాదెళ్ల వెంకట నరసయ్య, మల్లుపెద్ది తివిక్రమరావు, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలధీశ్వరస్వామిసేవలో..

స్థానిక బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని చాగంటి కోటేశ్వరరావు, శిష్య బృందంతో ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో వేదపండితులచే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ చాగంటి కోటేశ్వరరావును శాలువాతో సత్కరించగా, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ జ్ఞాపికను అందజేశారు.

మొవ్వలో..

చాగంటి దివిసీమ పర్యటనలో భాగంగా ఆదివారం మహాకవి క్షేత్రయ్య జన్మస్థలమైన మొవ్వ గ్రామానికి శిష్యబృందంతో విచ్చేశారు. ఈ సందర్భంగా క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మొవ్వ భీమేశ్వరస్వామివారి ఆలయాన్ని సందర్శించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావుతోపాటు గ్రామస్థులు చాగంటిని ఘనంగా సత్కరించారు.

సుబ్బారాయుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మోపిదేవి/చల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పాట్నా హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలకగా నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు శేషవస్త్రాలు అందజేశారు.

నడకుదురు పృథ్వీశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జి.అనుపమ చక్రవర్తి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు వారికి స్వాగతం పలికారు.



చిలకలపూడి నుంచి ప్రారంభమైన పాండురంగ స్వామి రథయాత్ర

వైభవంగా పాండురంగని రథయాత్ర



మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర స్వయంగా స్వామి వారి రథాన్ని నడిపారు. మునుపెన్నడూ లేని విధంగా స్వామి వారి రథోత్సవం నిర్వహించడం విశేషం. స్వామి వారి రథం తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. భజనలు చేస్తూ ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కూటమి నాయకులు అడుగడుగునా పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బేతాళ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాటాలు, కాంతార వేషధారణలతో ఆకట్టుకోగా.. ఉత్సవకమిటీ ప్రతినిధులు చలమలశెట్టి నరసింహారావు స్వామివారి ప్రతిమను అందజేశారు. కూటమి నేతలు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, బండి రామకృష్ణ, కొట్టె వెంకట్రావు, పంచపర్వాల కాశీవిశ్వనాథం, పంతంవెంకట గజేంద్ర తదితరులు పాల్గొన్నారు. కూడలి ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు, ఇస్కాన్ వారి భజనలు ఆకట్టుకున్నాయి. కోనేరు సెంటర్‌లో ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

ఇళయరాజా కటౌట్‌కు పాలాభిషేకం

» 8న విజయవాడలో మ్యాస్ట్రో సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మ్యూజికల్ కన్సర్ట్ నగరంలో జరగనుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈనెల 8న సాయంత్రం నిర్వహించనున్నారు. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆ ధ్వర్యంలో జరుగనున్న ఈ కచేరీకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. రాజధాని అమరావతికి సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించడంతో నగర ఖ్యాతిని మరింత పెం చేందుకు దోహదపడుతుందని సంస్థ ఆర్గనైజర్ పద్మనాభుని సుధాకర్ తెలిపారు. ఇళయరాజాతో కలిసి ఎస్పీ చరణ్, హరిచరణ్, మధుబాలకృష్ణన్, జితేంద్ రాజ్‌తో పాటు మరో 10 మంది ప్రముఖ గాయకులు పాల్గొంటారన్నారు. 70 మంది సంగీతకారుల బృందం సహకారంతో సంగీత ప్రి యులకు ఆహ్లాదకరమైన అనుభవం అందనుంది. 15 వేల మంది ప్రేక్షకులకు సిటింగ్ సౌకర్యం కల్పించారు. వాతరంతా ఒకే గొంతుతో పాడుకొనే దివ్య సదృశ్యాన్ని చూడనున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్టేడి యం సమీపంలో 50 అడుగుల ఇళయరాజా కటౌట్‌ను ఏర్పాటు చేయగా కళాకారులు, అభిమానులు కటౌట్‌కు పాలాభిషేకం చేశారు.

» నకిలీ మద్యం కేసులో అరెస్టుతో జోగికి మకిలి!
» కల్లు, సారా తయారీలో జోగి, అద్దేపల్లి కుటుంబాల ఉమ్మడి భాగస్వామ్యం
» ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని గట్ల గౌరవరంలో సారా తయారీ
» ఇబ్రహీంపట్నం ఫెర్రీలో విక్రయాలతో ఉమ్మడి వ్యాపారం
» కల్తీ మద్యం కోసం అద్దేపల్లి మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి స్పిరిట్
» మద్యం బాటిళ్లన్నీ ప్రధానంగా బెల్ట్ షాపులకే సరఫరా
» కల్తీ మద్యంలోనూ కక్కుర్తి.. స్పిరిట్, రంగు కలిపి వ్యాపారం
» కల్తీ మద్యం తాగి నాడు పలువురి మృతితో.. కొంత కాలం బ్రేక్
» తిరిగి కల్తీ మద్యం తయారీకి శ్రీకారం..
» జోగి నుంచి సహాయ సహకారాలు లభించాయని ఆరోపణలు
» తొలినుంచీ ఎమ్మెల్యేగా, మంత్రిగా అరాచకాల పర్వం!



జోగి అరెస్టు నేపథ్యంలోఎక్సైజ్ స్టేషన్ వద్ద నేతల హడావిడి

అక్రమాల్లో జోగుతూ..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇరుకుటుంబాల మధ్య తాతల నాటి బంధం

జోగి రమేశ్ తాత, అద్దేపల్లి జనార్దనరావు తాత ఇద్దరూ ఒకే వీధిలో ఉండటంతో రెండు కుటుంబాల మధ్య బంధం పెనవేసుకుపోయింది. జోగి రమేశ్ తాత కల్లు విక్రయించేవారు. అద్దేపల్లి జనార్దనరావు తాతకు చిల్లర కొట్టు ఉన్నప్పటికీ ఆయన కూడా కల్లు విక్రయించేవాడు. ఇలా ఇద్దరూ కొంతకాలం కల్లు విక్రయించారు. ఆ తర్వాత రెండు కుటుంబాల మధ్య కల్లు విక్రయాల విషయంలో గొడవలు రావడంతో పెద్దలు సయోధ్యను కుదిర్చారు. ఆ తర్వాత వారు సారా వ్యాపారం చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని గట్ల గౌరవరంలో నాటు సారా కాయించేవారు. అక్కడ కాసిన నాటుసారాను ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద విక్రయించేవారు. కొండపల్లి, దాములూరు, దొనబండ వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఫెర్రీకివచ్చి సారాయిని కొనుగోలు చేసేవారు.

> నకిలీ మద్యం తయారీ కేసులో అరెస్టుతో మాజీ మంత్రి జోగి రమేశ్‌కు మకిలి అంటుకుంది. రాజకీయాల్లోనూ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా జోగి రమేశ్ నిలిచారు. జోగి రమేశ్ అరెస్టు నేపథ్యంలో, ఇబ్రహీంపట్నంలో అద్దేపల్లి జనార్దనరావు కుటుంబంతో సాగించిన మద్యం వ్యాపారాల చరిత్ర బయటకువస్తోంది. 'మా తాత.. వాళ్ల తాత ఒకే వీధిలో ఉన్నారు.. తప్పితే తమకేమీ సంబంధాలు లేవు' అని చెప్పుకునే జోగి అసలు నిజాలు దాస్తున్న విషయం ఆయన అరెస్టుతో వెలుగులోకి వస్తున్నాయి..

హత్యకేసు నిందితుడికి ఆశ్రయంతో ఆర్థిక లబ్ధి!

జోగి రమేశ్ కుటుంబం అంతా సారాయి వ్యాపారంలో ఉండగా.. ఓ పరిచయం జోగి రమేశ్‌కు ఆర్థిక ప్రయోజనం కల్పించిందని తెలుస్తోంది. మూడు హత్యల్లో నిందితుడిగా ఉన్న గుంటూరు జిల్లా పట్నంబజారులో కిళ్లీకొట్టు నిర్వహించే ఓ వ్యక్తికి జోగి రమేశ్ మూడు నెలల పాటు ఆశ్రయం ఇచ్చారని దగ్గరగా ఆయన్ను చూసిన వారు చెబుతున్నారు. అతడికి ఆశ్రయం ఇచ్చినందుకు రూ.20 లక్షల మేర అప్పట్లో జోగికి లబ్ధి చేకూరినట్టు ఆయనతో సన్నిహితంగా ఉన్న వారు చెబుతున్నారు.

రాజకీయంగా రెచ్చిపోయిన జోగి!

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ఆర్‌ను ఆకర్షించిన జోగి రమేశ్‌కు విజయవాడ జోనల్ ఆర్టీసీ చైర్మన్ పోస్టు వరించింది. ఈ క్రమంలో సారా వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగింది. 1996లో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో అప్పట్లో ప్రజలకు అందాల్సిన నిత్యావసరాలను పక్కదారి పట్టించారన్న విమర్శలను మూటకట్టుకున్నారు. ఇదే సందర్భంలో మందుబాబులకు సారాను అప్పుగా ఇచ్చి తర్వాత అప్పు మాఫీగా వారినుంచి పది, ఇరవై సెంట్ల భూములను కూడా లాక్కున్నట్టు నాటి పలువురు బాధితులు చెబుతున్నారు.

కల్తీ మద్యం కుంభకోణంలో..

కల్తీమద్యం తయారీ చేయటానికి అద్దేపల్లి జనార్దనరావు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి స్పిరిట్‌ను అప్పటి నుంచే కొనుగోలు చేసి తెచ్చేవాడని తెలుస్తోంది. అప్పట్లో ఇబ్రహీంపట్నం కేంద్రంగానే కల్తీ మద్యం తయారీ చేసిన తర్వాత వాటిని ప్రధానంగా బెల్ట్ షాపులకు మాత్రమే సరఫరా చేసేవారని మైలవరం నియోజకవర్గ నేత ఒకరు చెప్పారు. బాటిళ్లలో స్పిరిట్ పోసి, రంగును కలిపి బెల్ట్‌షాపులకు కూడా తరలించారని, అప్పట్లో ఇబ్రహీంపట్నంలో వీటిని తాగిన వారు మరణించారని, రాష్ట్రంలోని కల్తీమద్యం మరణాలకు జనార్దనరావుతో పాటు జోగి రమేశ్ పాత్ర కూడా ఉందని స్థానిక నేత ఒకరు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ నుంచి వైసీపీ వరకు ఎమ్మెల్యేగా అరాచకాలు

కాంగ్రెస్ పార్టీలో ఉండగా.. ఆర్టీసీ చైర్మన్ వ్యవస్థలను రద్దు చేసిన తర్వాత జోగి రమేశ్‌కు వైఎస్ పెడన నియోజకవర్గం సీటు ఇచ్చారు. నాడు సానుభూతితో గెలిచిన జోగి అనంతరం సాగించిన అరాచకాలతో రెండోసారి ఓటమి చవిచూశారు. 2014లో మైలవరం నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి దేవినేని ఉమామహేశ్వరరావు చేతిలో ఓడిపోయారు. పెడనలో ఉండగా.. ఇబ్రహీంపట్నం థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని అప్పట్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెడనలో ఎమ్మెల్యేగా ఉన్నా సొంత నియోజకవర్గం మైలవరంలోనూ జోగి అరాచకాలు చేయటంతో ఓటమి చవిచూశారు.

● వైఎస్ఆర్ మృతి తర్వాత కొంతకాలం కాంగ్రెస్‌లోనే ఉన్న జోగి రమేశ్ ఆ తర్వాత వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరిగి పెడన నియోజకవర్గంలోనే జోగికి సీటు ఇవ్వగా గత అనుభవాలతో గెలుపు కోసం తల పగలకొట్టించుకుని సానుభూతితో గెలుపొందారు. తర్వాత మత్స్యకారుల నుంచి కూడా కమీషన్లు దండుకున్న ఆరోపణలను ఎదుర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా జోగి రమేశ్ ఇసుక అక్రమ వ్యాపారాలలో తలదూర్చారు. అనంతరం 2024 ఎన్నికల్లో పెనమలూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత జోగి రమేశ్ అగ్రిగోల్డ్ భూముల కబ్జా వ్యవహారంలో చిక్కుకున్నారు. కుమారుడు, సోదరుడు ఇద్దరూ అరెస్ట్ అయి బెయిల్‌పై వచ్చిన తర్వాత వియ్యంకుడి ఇంటికి వెళ్లి కొంత కాలం అజ్ఞాతంలో ఉన్నారు.

హైడ్రామా!

(5వ పేజీ తరువాయి)

సభ్యులను విచారించారు. దాదాపుగా రెండు గంటలపైగా పోలీసులు జోగి రమేశ్ ఇంట్లో ఉన్నారు. ఇదే సమయంలో అందుబాటులో ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు జోగి రమేశ్ ఇంటికి తరలివచ్చారు. జోగి రమేశ్ ఆదేశాల మేరకు ఇంటి దగ్గర బైఠాయించి కొందరు ఆందోళన ప్రారంభించారు. ఈ నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు అరెస్టు చేస్తున్నట్టు చెప్పారు. జోగి రమేశ్ కూడా అరెస్టుకు సహకరించారు. తన సతీమణి, కుటుంబసభ్యులతో బాల్కనీలోకి వచ్చి పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. ఆ తర్వాత ఏసీపీ దామోదర్ వెళదామని చెప్పగా, జోగి రమేశ్ తన భార్యకు ధైర్యంగా ఉండాలని చెప్పి కిందకు వచ్చారు. పోలీసులు జోగిని వ్యాన్‌లోకి ఎక్కించే క్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. జోగి రమేశ్ వ్యాన్ ఎక్కిన తర్వాత మీడియాతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వ్యాన్‌ను విజయవాడ వైపు మళ్లించారు. జోగి రమేశ్‌ను ఉదయం 8.30 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం 9 గంటల కల్లా గురునానక్ కాలనీకి తీసుకువచ్చారు.

ఉదయం హడావిడి.. మధ్యాహ్నం నిర్మానుష్యం

ఆదివారం ఉదయం జోగి అరెస్టు సమయంలో ఆయన ఇంటి వద్ద పలువురు నాయకులు, కార్యకర్తలు కొద్ది సేపు ఆందోళన చేసి వెళ్లిపోయారు. అటు తర్వాత ఎవ్వరూ జోగి ఇంటి వైపు కన్నెత్తి చూడలేదు. జోగి రమేశ్ భార్య శకుంతల మాత్రం ఇంట్లో ఉన్నారు. ఆమెను పరామర్శించేందుకు ఆమె సోదరుడు పెడన నుంచి వచ్చారు.

నా అరెస్టు అక్రమం : జోగి రమేశ్

చంద్రబాబు అక్రమంగా అరెస్టు చేయించారు. నన్ను అరెస్టు చేయించి ఆయన రాక్షస ఆనందం పొందాలని చూస్తున్నారు. కాశీ బుగ్గ తొక్కిసలాట జరిగితే స్పందించలేదు. కల్తీ మద్యం తయారీలో నా ప్రమేయం లేదని ఎన్నో రోజుల నుంచి చెబుతున్నా. అన్యాయంగా నన్ను అరెస్టు చేశారు.

నా భర్తను అన్యాయంగా అరెస్టు చేశారు

శకుంతల, జోగి రమేశ్ సతీమణి



నా భర్తను అన్యాయంగా అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన నిర్దోషిగా తిరిగి వస్తారు. అప్పటి సీఎం జగన్‌కు సారీ చెప్పించేందుకే చంద్రబాబు ఇంటి వద్దకు నా భర్త వెళ్లాడు. కానీ దాడికి వెళ్లాడని అలా కల్పించుకొని నా భర్తపై అప్పట్నుంచి కోపం పెంచుకున్నారు. అంతకు మించి ఏం లేదు. వారికి కుటుంబాలు ఉన్నాయ్. వారి మనసాక్షికే వదిలేస్తున్నాం. దేవుడు చూస్తున్నాడు.

జోగి శిక్ష అనుభవించక తప్పదు

- అక్కల రామ్మోహన్‌రావు

తప్పు ఎవరు చేసిన శిక్ష అనుభవించక తప్పదని.. కల్తీ మద్యం కేసులో అరెస్టు అయిన మాజీ మంత్రి జోగి రమేశ్ ఉదంతమే ఇందుకు నిదర్శనమని మైలవరం నియోజకవర్గ జనసేన కన్వీనర్ అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయన్నారు. అందులో కల్తీ మద్యం ఒకటన్నారు. జనార్దనరావు అనే వ్యక్తి ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా నెల రోజుల నుంచి అధికారులు ఆధారాలు సేకరించి ఈరోజు జోగిని అరెస్టు చేశారని తెలిపారు. ఆయన అరెస్టును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని జోగితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, వైసీపీ కార్యకర్తలు ఆరోపణలు చేసినంతమాత్రాన చేసిన తప్పు దాగదన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై ప్రత్యేక దృష్టి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవ భారత రాజ్యాంగ నిర్మాత, దేశాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను, మేధోసంపత్తిని తరతరాలకు అందించేందుకు ఆయన పేరిట ఏర్పాటు చేసిన స్మృతివనం నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, ఆ మహనీయునికి విశిష్ట గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్ మల్లికార్జునరావు, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనానికి సంబంధించిన అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్మృతివనం నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి చోటులేదని, ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంస్థను ఆదేశించామన్నారు. ఆదేశాలను బేఖాతరు చేస్తే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. స్మృతివనం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు అప్పగించిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా నిరంతర అభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరపాలక సంస్థ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు, ఏపీఐఐసీ, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కు!

(5వ పేజీ తరువాయి)

దెబ్బతింటున్నాయి. ఏళ్ల తరబడి తాగునీటి కలుషిత సమస్య ఉన్నా అటు ఆర్‌డబ్ల్యూఎస్, ఇటు ఎన్టీటీపీఎస్ అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అనేక సార్లు ఆందోళనలు చేశారు.

ఆర్డీవో పర్యటనతో వెలుగులోకి ఎన్టీటీపీఎస్ ఆగడాలు

ఇటీవల తాగునీటిలో బూడిద అవశేషాలు కలవడం అధికం కావడంతో విషయం కాస్త జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. నెల రోజుల క్రితం కృష్ణా జలాలు ఎలా కలుషితం అవుతున్నాయో తెలుసుకునేందుకు కలెక్టర్ ఆదేశాలలో క్షేత్రస్థాయి పరిశీలనకు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య వచ్చారు. ఎన్టీటీపీఎస్‌లోని డ్రెయినేజీ ద్వారా బూడిద నీరు నేరుగా ఎన్టీటీపీఎస్ చన్నీళ్ల కాల్వకట్టపై పంపుహౌస్ ఎగువ భాగంలో కలుస్తున్న విషయాన్ని ప్రత్యక్షంగా చూశారు. ఆ పంపు హౌస్ నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి తాగునీటిని తీసుకోవడం వల్ల బూడిదతో కలిసిన తాగునీరు ఫిల్టర్ బెడ్స్ కూడా శుద్ధి చేయలేక 143 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతున్న విషయాన్ని ప్రజా ప్రతినిధులు ఆర్డీవోకు వివరించారు. దీంతో కావూరి చైతన్య పంపుహౌస్‌ను ఎన్టీటీపీఎస్ డ్రెయినేజీ కలిసే ప్రదేశానికి ఎగువన పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లే అని అందరూ అనుకున్నారు. అయితే నెల రోజులు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారానికి అడుగులు పడటం లేదు. యథావిధిగా మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాలకు, కొండపల్లి మున్సిపాలిటీకి, తిరువూరు నియోజకవర్గంలోని ఎ.కొండూరు మండలంలోని 143 గ్రామాల ప్రజలకు బూడిద అవశేషాలు కలిసే తాగునీరే సరఫరా అవుతుంది.

రూ.కోటి ఖర్చుతో సమస్యకు చెక్

తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు అయ్యే ఖర్చు కేవలం రూ.కోటి మాత్రమే. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఓఅండ్ఎం కింద ఉన్న నిధులను ఖర్చు చేయకుండా ఏడాదికి రూ.4.5 కోట్లు మురగబెట్టేందుకు ఇష్టపడుతున్నారు తప్ప ఒక కోటి ఖర్చు చేసి ఎన్టీటీపీఎస్ చన్నీళ్ల కాల్వపై ఉన్న పంపుహౌస్‌ను బూడిద నీరు కలిచే ఎగువ ప్రాంతంలోకి మార్పు చేయడం లేదు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎస్ఆర్ 0నిధుల నుంచి ఆ రూ.కోటి వెచ్చించి సమస్యను పరిష్కరించదు. అటు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం బూడిద నీరు చన్నీళ్ల కాల్వలో కలువకుండా చూడలేదు. ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ మార్చి తాగునీటిలో బూడిద అవశేషాలు కలువకుండా చూడకపోవడంతో ఆ సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందా అని 143 గ్రామాల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

అపార నష్టం!

(5వ పేజీ తరువాయి)

మేర నష్టం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.


228 పునరావాస కేంద్రాలకు 23,744 మంది తరలింపు

జిల్లాలో 228 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 23,744 మందికి ఆశ్రయం కల్పించినట్లు నివేదిక పంపారు. తుపాను ప్రభావంతో బలమైన గాలులు వీయడంతో కృత్తివెన్ను మండలం కృత్తివెన్నుకు చెందిన కోయ సుబ్బారావు (54)పై చెట్టు విరిగిపడటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన కాళింగ రాజ్యలక్ష్మిపై చెట్టు విరిగిపడటంతో ఆమె కాలు విరిగిందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో తెలిపారు. తుపాను కారణంగా 16 గొర్రెలు, ఒక పాడిపశువు చనిపోయిందని, పశువులపాకలు 33 ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. మొత్తంగా రూ.2.35 లక్షల నష్టం వాటిల్లిందని తేల్చారు. మత్స్యశాఖ ఇచ్చిన నివేదికలో 71 పడవలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 279 వలలు పాడైపోయాయని, 12 పడవలు పూర్తిగా దెబ్బతిన్నాయని, 37 వలలు కొట్టుకుపోయాయని, మూడు మోటారు బోట్లు దెబ్బతిన్నాయని, 452 చెరువులు ధ్వంసమయ్యాయని మొత్తంగా రూ.1.08 కోట్ల మేర నష్టం వాటిల్లిందని నివేదికలో పొందుపరిచారు. రెండు రోడ్లు పాక్షికంగా దెబ్బతిని రూ.23 లక్షల నష్టం వాటిల్లిందని నివేదికలో వివరించారు. విద్యుత్ శాఖకు సంబంధించి 33 కేవీ ఫీడర్‌లు 22, 11కేవీ ఫీడర్‌లు 342, 33/11కేవీ ఫీడర్‌లు 63, 917 విద్యుత్ స్తంభాలు, 78.3 కిలోమీటర్ల మేర విదుత్‌వైర్లకు సంబంధించి రూ.6.36 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొన్నారు.

కోటి దీపోత్సవం, కలశజ్యోతి ఊరేగింపునకు

పటిష్ట భద్రతా చర్యలు

దీపోత్సవంలో పాల్గొనేందుకు భక్తులకు అవకాశం లేదు: దుర్గగుడి చైర్మన్, ఈవో



కరపత్రం, గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న చైర్మన్, ఈవో, అధికారులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా నిర్వహించే దీపోత్సవం, భవానీ దీక్షల విరమణల సందర్భంగా డిసెంబరు 4న జరిగే కలశజ్యోతి ఊరేగింపులో పాల్గొనే భవానీలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని దేవస్థానం కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్ అధికారులకు సూచించారు. ఆదివారం మహామండపం 4వ అంతస్తులోని ఈవో చాంబర్‌లో కమిటీ చైర్మన్, ఈవో ఆయా విభాగాల అధికారులతో పాటు వైదిక కమిటీ సభ్యులు, ఏసీపీలు రామచంద్రరావు, దుర్గారావు, సీఐలు గురుప్రకాష్, ఉమామహేశ్వరరావుతో సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 5న జరిగే దీపోత్సవం, డిసెంబరు 4న జరిగే కలశజ్యోతి ఊరేగింపు ఏర్పాట్లు, వైదిక కార్యక్రమాల గురించి ఆయా వి భాగాల అధికారులు, వైదిక కమిటీ స భ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈనె ల 5న జరిగే కార్తీకపౌర్ణమి దీపోత్సవం పూర్తిగా దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఆరోజు సాయంత్రం దీ పాలు అర్చకులు మాత్రమే వెలిగిస్తార ని, భక్తుల భద్రత నిమిత్తం వారికి పా ల్గొనే అవకాశం లేదన్నారు. ఏ ఏ ప్రదేశాల్లో ఎక్కడ దీపాలు ఏర్పాటు చేయా లి, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. డిసెంబరు 4న జరిగే కలశజ్యోతి ఊరేగింపు, తరువాత జరిగే భవానీ దీక్ష ల విరమణ ఏర్పాట్లును పటిష్ఠంగా చే పట్టాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. అనంతరం భవానీ దీక్షల కరపత్రం, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పశ్చిమ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, లా అండ్ ఆర్డర్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్, భవానీపురం సీఐలు గురుప్రకాష్, ఉమామహేశ్వరరావు, స్థా నాచార్యుడు వీ శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు షణ్ముఖ శాస్త్రి, వీఎస్ మహర్షి, ఈఈలు కోటేశ్వరరావు, రాం బాబు, ఏఈవోలు చంద్రశేఖర్, సుధారాణి, రమేష్‌బాబు, వెంకట రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

దీపోత్సవానికి ఏర్పాట్లు చేయండి

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గగుడిలో ఈనెల 5న జరగనున్న కోటి దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. కోటి దీపోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఇటీవల జరుగుతున్న ఘటనల నేపథ్యంలో దుర్గగుడిలో జరిగే కోటి దీపోత్సవానికి ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ చర్యలు చేపట్టాలని, అంబులెన్స్ వైద్య సిబ్బంది, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని భక్తులు కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

సందడిగా వాకర్స్ వనసమారాధన



గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న అవుటపల్లి శివారు తోటలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన సందడిగా జరిగింది. తొలుత కార్తీకమాస పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా వాకర్స్, పిల్లలకు మ్యూజిక్ ఛైర్స్, అంత్యా క్షరి, క్విజ్, తదితర పోటీలు పెట్టారు. వాకర్స్ జిల్లా గవర్నర్ లోయ ఈశ్వ రరావు మాట్లాడుతూ, నడకతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. కేవీఆర్ కిషోర్, కెఎస్ జగదీశ్వరరావు, టి.సీతారాం, వాకర్స్ శ్రీనివాసరావు, వెంకయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, సుబ్బారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

16 ఏళ్లకే ఫ్లైవోవర్!

- శిథిలావస్థలో ఆర్వోబీ
- మూసివేసిన మెట్ల మార్గం
- విరిగిపోయిన రైలింగ్ స్తంభాలు
- తీవ్ర వ్యయ ప్రయాసలు పడుతున్న కాలినడక ప్రయాణికులు



ఫ్లైవోవర్‌పై విరిగిపోయిన రైలింగ్.. మూసివేసిన ఆర్వోబీ వంతెన మెట్లమార్గం

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

స్థానిక నూజివీడు రోడ్డులోని ఆర్వోబీ శిథిలావస్థకు చేరింది. 2009లో నిర్మించిన వంతెన మార్గం తరుచు గుంతలు పడి మరమ్మతుకు గురవుతున్న విషయం తెలిసిందే. నూరేళ్లు ఉండాల్సిన ఫ్లైవోవర్ 16 ఏళ్లకే శిథిలావస్థకు చేరింది. తరుచు వంతెన మార్గంపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారుతోంది. గత వైసీపీ పాలనలో గుంతలను లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు నిర్వహించారు. మళ్లి కొద్ది రోజులకే గుంతలు ఏర్పడడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ ఆ గుంతలకు మరమ్మతు నిర్వహించారు. వైసీపీ పాలనలో వంతెన రైలింగ్ గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో రైలింగ్ స్థంభాలు సగం విరిగి ప్రమాదభరితంగా మారగా వాటిని కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు జరిపారు. కొద్ది నెలల కిందట మళ్లీ మరో చోట మరో వాహనం ఢీ కొనడంతో రైలింగ్ ధ్వంసం అయ్యింది. అదీ కూడా ప్రమాద భరితంగా మారింది. రహదారి మార్గం తరుచు మరమ్మతులు నిర్వహించిన శిథిలావస్థకు చేరిన ఫ్లైవోవర్‌కు ఇరువైపుల ఉన్న మెట్ల మార్గాన్ని అధికారులు పట్టించుకోలేదు. మెట్ల మార్గం గోడలు కూడా కూలిపోవడంతో గత్యంతరం లేక అలాగే ప్రయాణికులు తమ ప్రాణాలను గుప్పెట పెట్టుకొని కొంత కాలం రాకపోకలు సాగించారు. ఇటీవల స్థానికులు పూనుకొని రాకపోకలు సాగించకుండ మెట్ల మార్గాన్ని ఇటుక రాళ్లతో మూసివేశారు. దీంతో ఫ్లైవోవర్ మీద దిగి స్టేషన్‌కు వెళ్లే వారు, స్టేషన్ నుంచి కాలి నడకన ఫ్లైవోవర్ చేరుకునే వారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. నడవలేని వారు ఆటోల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెట్ల మార్గం మూసి వేయడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర వ్యయ ప్రయాసలు పడుతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని మెట్ల మార్గానికి మరమ్మతులు జరపాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలు 8 నుంచి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు శ్రీ భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10న విజయ గణపతి, శ్రీశేష భగవాన్ ఆలయ ప్రవేశంతో పాటు నవ గ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, 11న అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి పుష్పాలంకరణ, అన్నసమారాధన కార్యక్రమాలకు భక్తులు ద్రవ్య, ధన రూపాల్లో సహాయ సహకారాలు అందించాలని చిన్నా కోరారు.



కేసరపల్లిలో సమిష్టి దివ్యబలిపూజ సమర్పిస్తున్న ఫాదర్ కిషోర్

కేసరపల్లిలో సకల ఆత్మల సంస్మరణ పండుగ

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం విచారణ ఆధ్వర్యంలో సకల ఆత్మల సంస్మరణ సందర్భంగా సమాధుల ప్రాంగణంలో మరణించిన వారి ఆత్మల శాంతి కోసం ఆదివారం దివ్యబలిపూజను సమర్పించారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్, నిడమానూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ కంచర్ల సందీప్‌లు దివ్యబలిపూజను సమర్పించారు. కుటుంబంలో మరణించిన వారి సమాధులను ప్రత్యేకంగా అలంకరించి వారి ఆత్మల కోసం, దిక్కులేని ఆత్మల కోసం నిత్య విశ్రాంతి దయ చేయమని ప్రార్థనలు చేశారు. మృతి చెందిన వారిని స్మరించుకోవాలన్నారు.



న్యాయ విద్యార్థులతో కలిసి ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న తుమ్మలపల్లి

స్వచ్ఛ కంకిపాడు లక్ష్యం

కంకిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ కంకిపాడు లక్ష్యంగా సిద్ధార్థ న్యాయ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. న్యాయ విద్యార్థులు చేపట్టిన స్వచ్ఛ కంకిపాడులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాట్లాడుతూ, 2014 - 19 మధ్య కాలంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి కంకిపాడులో స్వచ్ఛ కంకిపాడు కార్యక్రమాన్ని విజయవంతంగా ఏడాదిన్నర పాటు నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం చీపురులు చేత పట్టి పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయిన రోహిణి కుమారి, కంకిపాడు పీఏసీఎస్ చైర్మన్ సుంకర శివ, కూటమి నాయకులు ఏనుగ జయ ప్రకాష్, బోయిన నాగరాజు, చిట్టూరి నాగేశ్వర రావు, కాకుమాను రమేష్, అన్నే రామారావు, బాజి, నన్నా తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు

వైద్యశిబిరానికి విశేష ఆదరణ

పెనమలూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అనుమోలు ఆదరణ ట్రస్టు ఆధ్వర్యంలో పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష ఆదరణ లభించింది. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మూడు వందలకు పైగా స్థానికులు హాజరై షుగరు, బీపీ పరీక్షలను చేయించుకొన్నారు. ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాస్, కోలా శివశంకరప్రసాద్, రాధాకృష్ణ, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

పమిడిముక్కల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంటాడ మల్లేశ్వరస్వామి (శివాలయం)లో హుండీ పగులగొట్టి అందులోని కానుకలు దోచుకుపోయిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. మంటాడ-ఉయ్యూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయం ముఖద్వారం వద్ద ఉన్న హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న సొమ్ము దొంగలు చోరీ చేశారు. ఉదయం ఆలయం, పరిసరాలు శుభ్రపరిచేందుకు వచ్చిన మహిళకు ముఖద్వారం ఇనుపగ్రిల్లు తాళం లేకపోవడం చూసి వాచ్‌మేన్‌కు సమాచారం అందించింది. ఆయన కమిటీ సభ్యులకు తెలిపాడు. వారు పమిడిముక్కల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బి.శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఉయ్యూరు మండలం వీరవల్లిముఖాసా రామాలయం వద్ద లక్ష దీపార్చన

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మడిచర్లలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన లక్షబిల్వార్చన కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తదనంతరం 150మంది దంపతులు పాల్గొనగా సహస్ర లింగార్చన నిర్వహించి లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి సాయికళ్యాణి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తదనంతరం మూల్పూరి సాయిశోభన్ చౌదరి పర్యవేక్షణలో నిర్వహించిన సహస్ర దీపార్చనలో మహిళలు పాల్గొని దీపారాధన నిర్వహించారు.

ఉయ్యూరు: కార్తీకమాస ఏకాదశి పురస్కరించుకుని వీరవల్లి మొఖాస కోదండ రామాలయం వద్ద ఆదివారం లక్ష దీపోత్సవం చేశారు. ఈ సందర్భంగా శివకళ్యాణం జరిపించి సాయంత్రం లక్ష దీపాలతో మహిళలు దీపోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ, అనిల్ తదితరులు పర్యవేక్షించారు. వీరవల్లి మొఖాస, కడవకొల్లు గ్రామాల మహిళలు లక్ష దీపోత్సవంలో పాల్గొన్నారు.



ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడుకు ఘన నివాళి

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్ర మంత్రి కింజరపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు చిత్రపటానికి రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావుల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎర్రన్నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దుర్గగుడి బోర్డు సభ్యులు వెలగపూడి శంకరబాబు, సీనియర్ నేత మారుపూడి ధన కోటేశ్వరరావు, పెనమలూరు మండల టీడీపీ అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, చెన్నుపాటి శ్రీనివాస్, వీరంకి కుటుంబరావు, కొనతం సుబ్రహ్మణ్యం, జన్ను నాగరాజు, షేక్ సలీం, ఆకునూరు సుబ్బారావు, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు కొల్లి సేవలు నిరుపమానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజానికి భావిభారత పౌరులను అందిస్తూ దిశానిర్ధేశం చేసే ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో సేవలందించిన వ్యక్తి కొల్లి రామ్మోహనరావు అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కొనియాడారు. వీరవల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొల్లి రామ్మోహనరావు చిత్రపటానికి ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. రామ్మోనరావు మాస్టారు వృత్తిపట్ల అంకితభావంతో చేసిన కృషిని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయన అకాలమరణం తనను కలచివేసిందన్నారు. రామ్మోహనరావు సతీమణి వెంకటసుబ్బమ్మ, కుమారులు కె.ఎస్.ఆర్.శ్రీనివాసరావు, రాముజీ, లక్ష్మణజీలను ఆయన పరామర్శించారు. టీడీపీ నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, అమృతపల్లి సూర్య నారాయణ, అజయ్‌కుమార్, మండాది రవీంద్ర, సాయి, జోజి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లి రామ్మోహనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ కేవీఆర్ కిషోర్ అన్నారు. స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి బాలబాలికలు, అండర్-14 డివిజన్ స్థాయి ఎంపికలు ఆదివారం జరిగాయి. స్రవంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి పతకాలతో తిరిగి రావాలన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలకు గతంలో సహకారం అందించామని భవిష్యత్‌లో కూడా తోడ్పాటు ఉంటుందన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి జి.రాంబాబు, ధనియాల నాగరాజు, బి.సత్య నారాయణ, కేవీ రామారావు, బాలకృష్ణ, మీరా సాహేబ్, టాన్యగిరి పాల్గొన్నారు.



వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఉయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ఉయ్యూరులో ఆదివారం బొల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం, రుద్రాభిషేకం, గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడుకు చెందిన పురోహితుల బృందం పూజా కార్యక్రమాలు, స్వామి వారి కల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. శాస్త్రోక్తంగా వేద మంత్రాల పఠనం, వేద ఘోషతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. బొల్లా నాని దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొనగా పలువురు ప్రముఖులు హాజరై శివపార్వతుల కల్యాణం ఆసక్తిగా తిలకించారు. ఉయ్యూరు, పలు ప్రాంతాలనుంచి భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి కల్యాణం, పూజాకార్యక్రమాల్లో పాల్గొని భక్తి పారవశ్యంతో ఓంనమశ్శివాయ నామస్మరణతో ఓలలాడారు.



శ్రీవారికి పూల బుట్టలతో పుష్పయాగ మహోత్సవంలో భక్తులు

వేడుకగా పుష్పయాగ మహోత్సవం

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాడిగడప శ్రీనివాసుడి పుష్ప యాగ మహోత్సవం ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. కార్తీక శుద్ధ ద్వాదశి, పూర్వభాద్ర నక్షత్రం సందర్భంగా వందలాది మంది భక్తులు తాడిగడప ఎస్సీబి నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. తోమాల సేవ, పుణ్యాహవచనం, రక్షాబంధనం అనంతరం వేలాది పుష్పాలతో తాడిగడప నుంచి భక్తులు పుష్పాల బుట్టలతో ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నంమహాపూర్ణాహుతి అనంతరం మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో వందలాది భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ప్రమాణస్వీకారం

ప్రసాదంపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా కళ్లేపల్లి సాయిరామరాజు చేత రాష్ట్ర అధ్యక్షులు కర్నాలు బసవరాజు ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారం రామవరప్పాడు వెంకటమ్మ పేరంటలమ్మ ఆలయంలో ఎన్టీఆర్ జిల్లా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటి 39 మంది సభ్యులతోనూ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పిల్లడి రుద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు జైశ్రీరామ్ రామరాజు, కొణతం అప్పలరాజు, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ నేత ఉమామహేశ్వరరావు

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారానికి పోరాటమే మార్గమని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 9వ మహాసభ గన్నవరం సంఘ కార్యాలయంలో ఆదివారం మామిడి గణేష్, కె.శ్రీనివాసరావుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పంచాయతీలో పని చేసే కార్మికులు నిరంతరం సమస్యల తో సహజీవనం చేస్తున్నారు. తొలుత సీఐటీయూ జెండాను నాగమణి ఎగురవేశారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ఎం.పోలినాయుడు గత మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా దానిపై చర్చించారు. ప్రజాసంఘాల నాయకులు తాతబ్బాయి, సాంబశివరావు, ఏసుదాసు, ఆంజనేయులు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవం

ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.పోలినాయుడు, ఆఫీస్ బేరర్స్‌గా ఎం.గణేష్, పి.కృష్ణకుమారి, ఎం.ప్రభుశేఖర్, టి.అబ్రహం, కె.రాజేష్, వి.శ్రీనివాసరావు, ఎం.జగన్, రామకృష్ణతో పాటు 29 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పోలినాయుడు తెలిపారు.

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ఉయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సిద్ధార్థ అకాడమి సభ్యుడు, కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సభ్యులంతా కలసి వనసమారాధన ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినుల కోలాట కార్యక్రమం అందరిని అలరించింది. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. వాకర్స్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు, ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రావి కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ఉయ్యూరు సీఐ రామారావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సాంబశివ రావు, అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణ, పలువురు సభ్యులు పాల్గొని ఉల్లాసంగా కార్యక్రమం నిర్వహించారు.

దిక్సూచి

క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్
వేగం, కచ్చితత్వం ప్రధానం



ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్ చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్ళాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

బీ డిజైన్ సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కో దానిలో 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

ఎం డిజైన్
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Colgate Keep India Smiling Scholarship 2025-26

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.
Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.
Prizes & Rewards: Scholarship of INR 75,000
Last Date to Apply: 09-11-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CKISSP7
buddy4study.com

రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

ఖాళీలు 3058

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: 2424
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 394
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 163
- ట్రైనీ క్లర్క్: 77

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 27

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

ఖాళీలు 5810

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్వైజర్: 161
- స్టేషన్ మాస్టర్: 615
- గూడ్స్ రైలు మేనేజర్: 3416
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: 921
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 638
- ట్రాఫిక్ అసిస్టెంట్: 59

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

ఇంకొన్ని

ఖాళీలు 2569

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.
అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
ఎంపిక: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★




దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు

"'జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

60వ వసంతంలోకి షారుక్


ఫరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహర్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.



హైదరాబాద్‌లో భారీ ఈవెంట్

మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.

పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

మనం గర్వపడే సినిమా

రామ్ పోతినేని



రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీ స్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.



వసుదేవ సుతం

మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.



రైతుల వెతలే కథగా...

పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఆర్థిక సాయం

పెదపారుపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన పీ4 పథకం పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదపడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు పెదపారుపూడిలో మొంథా తుఫాన్ కారణంగా అనేక ఇబ్బందులు పడ్డ అంగిరేకుల రామారావు, రామస్వామి కుటుంబానికి పీ4 పథకం ద్వారా టీడీపీ నాయకులు చప్పిడి కిషోర్, ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు ఎమ్మెల్యే ద్వారా ఆర్థిక సాయమందించారు. తహసీల్దార్ బి.శ్రీనునాయక్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శి ఈశ్వరి కుమారి, దగాని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


ఎర్రన్నాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రిగా, శాసనసభ్యుడిగా, ఐక్యరాజ్యసమితిలో భారతదేశ గళాన్ని వినిపించిన వ్యక్తి ఎర్రన్నాయుడని, ఆయన చేసిన సేవలు మరువలేనివని కూటమి నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎంపీ ఎర్రన్నాయుడు 13వ వర్థంతి సందర్భంగా ఆదివారం స్థానిక నీలామహల్ రోడ్డులోని ఎర్రన్నాయుడు, తాండ్రపాపారాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, చేకూరు జగన్మోహనరావు, పంద్రాజు సాంబశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

పెదపారుపూడి : క్రీస్తు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలని గుడివాడ డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలోని రక్షణ సైనిక దేవాలయంలో సంఘస్తులు పెయ్యల శ్రీనివాస్ - భాగ్యలక్ష్మి దంపతులు బహుకరించిన సౌండ్ బాక్స్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేవుని యందు ప్రేమతో ఉండాలని, అటువంటి వారికి ప్రభువు ఎల్లప్పుడు రక్షణగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు శ్రీనివాస్ - భాగ్యలక్ష్మి దంపతులతోపాటు కాపరి మేజర్ విజయ్ కుమార్, మేజర్ రూతు కుమారి, సంఘ పెద్దలు దగాని జోసెఫ్, నత్త భూషణ్ కుమార్, గూడపాటి భాస్కరరావు, గృహ సమితి మహిళలు పీకా పద్మ, గుమ్మడి యేసు మరియమ్మ, దగాని గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ : మతిస్థిమితం లేని తన భర్త కనిపించడం లేదంటూ ఆయన భార్య వెంకటలక్ష్మీ ఆదివారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక ఏలూరు రోడ్డులోని గాంధీ బొమ్మ వీధికి చెందిన మున్సిపల్ ఉద్యోగి గేదెల సత్యనారాయణకు 2024లో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మతిస్థిమితం కోల్పోయారు. అక్టోబరు 27వ తేదీన ఇంటి నుంచి వెళ్ళిన భర్త సత్యనారాయణ తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదంటూ భార్య వెంకటలక్ష్మీ ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

దారులు ధ్వంసం .. ప్రయాణం నరకం

● వాహనదారులకు తప్పని ఫీట్లు
● పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు- ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు శివారు కలాసమాలపల్లి(అంబేడ్కర్ నగర్) నుంచి వల్లూరుపాలెం వెళ్లే కేఈబీ కెనాల్ చిన్నకట్ట రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు ఒక కిలోమీటరు రోడ్డు గోతులతో ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగజేస్తోంది. కలాసమాలపల్లి ప్రజలు వల్లూరుపాలెం వెళ్లేందుకు చిన్నకట్ట రోడ్డు దగ్గరి మార్గంగా ఉంది. గత కృష్ణా పుష్కరాల సమయంలో వల్లూరుపాలెం వైపు కొంత భాగం రోడ్డుకి గ్రావెల్ వేసి, మిగిలిన రోడ్డుని అలాగే వదిలేయటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని కలాసమాలపల్లి ప్రజలు చెపుతున్నారు. గోతులకు తోడు రోడ్డుకిరువైపులా పిచ్చి చెట్లు పెరగటంతో మరింత సమస్యగా ఉందంటున్నారు. విజయవాడ నుంచి తిరిగి వచ్చేటప్పుడు వల్లూరుపాలెం నుంచి చిన్నకట్ట రోడ్డు నుంచి వస్తామంటున్నారు. వర్షాకాలంలో గోతులతో ప్రయాణం నరకంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ నుంచి అనేక గ్రామాల వద్ద చిన్నకట్ట రోడ్డుని తారురోడ్డుగా అభివృద్ధి చేశారని, కలాసమాలపల్లి వద్ద మాత్రం గోతుల తోనే వదిలేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 75 లక్షలతో అంచనాలు పంపించాం

కలాసమాలపల్లి నుండి వల్లూరుపాలెం వరకు చిన్నకట్ట రోడ్డుని తారురోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ 75 లక్షలతో అంచనాలు తయారుచేసి ఎంపీ వల్లభనేని బాలశౌరీ కార్యాలయానికి పంపించాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభిస్తాం.

శరాబంది రాజు , మండల పీఆర్ ఏఈ


గోతులతో నిండిన వల్లూరుపాలెం వెళ్లే చిన్నకట్టరోడ్డు


పిచ్చి చెట్లతో మూసుకుపోయిన కలాసమాలపల్లి రోడ్డు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టూరి రవీంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక గౌరీశంకరపురంలోని కళాశాల వద్ద నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టేందుకు చిన్న వయస్సు నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వేగంగా వాహనాలు నడపడంవల్లే ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఈ ర్యాలీలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో సతీష్‌చంద్ర, కో-ఆర్డినేటర్ జీవన్, పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ, పోతురాజు విగ్రహాల గ్రామోత్సవం

గుడ్లవల్లేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ నూతన ఆలయ నిర్మాణం గ్రామస్థులచే నిర్వహించారు. కాగా సోమవారం ఉదయం గంగానమ్మ అమ్మవారి, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి,పోతురాజుల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి గ్రామప్రదక్షిణ, బలిహరణ, వాస్తు పూజ,వాస్తు హోమం,జలాధివాసం,క్షీరాధివాసం,నీరాజనం ఉదయం కార్యక్రమాలుగా నిర్వహించారు. సాయంత్రం ధాన్యధివాసం,శాంతి కుంభస్థాపన, యాగశాలార్చన, అధివాసాంగ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కాగా పాలపర్తి ప్రేమచంద్ర శర్మ(నాని)సోమరాజుపల్లి ఈశ్వర నాగ కుమార శర్మల బ్రహ్మత్వంలో పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం ఉదయం 10-43 గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం 7 వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో వల్లభనేని వెంకటరావు, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకటరావు, యలమంచిలి రామకోటేశ్వరరావు, యనిగళ్ల నాగేశ్వరరావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, రవితేజ తదితరులు పాల్గొన్నారు.


గంగానమ్మ,పోతురాజు విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న యువకులు

వైద్యరంగంలో ఏఐతో విప్లవాత్మక మార్పులు

● డాక్టర్ రమేష్ పోతినేని

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రాకతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, వైద్యరంగంలో నిరంతర ఆవిష్కరణలు ప్రజలకు చేరువ కావాలని ఆస్టర్ రమేష్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ పోతినేని అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, ఆస్టర్ రమేష్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో వైద్యులకు నిరంతర వైద్య విద్యపై సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్‌లో పాల్గొన్న వైద్యులతో నూతన ఆవిష్కరణలను పంచుకోవడం సంతోషకరమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో వైద్యరంగంలో అనేక మార్పులు వచ్చాయని, తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం డాక్టర్ రమేష్ పోతినేనిను ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఐఎంఏ గుడివాడ శాఖ సభ్యుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, వైద్యులు పాల్గొన్నారు.


డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న ఐఎంఏ సభ్యులు, యలవర్తి

విలువలతో కూడిన విద్యను అందించాలి

పామర్రు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్సు పట్ల అవగాహన పరిశీలన శక్తి పెంపొందింపజేసే విధంగా విద్యాబోధన చేస్తే వారిలో శాస్త్రీయ దృక్పథం పెరిగి భావితరశాస్త్రవేత్తలుగా ఎదగడానికి అవకాశముంటుందని పామర్రు మండల జనవిజ్ఞాన వేదిక కన్వీనర్, పిల్లల వైద్యనిపుణులు పిసురేష్‌చంద్రారెడ్డి అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జడ్పీ హైస్కూల్లో వివిధ పాఠశాలల విద్యార్థులకు సైన్సుటాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిలువలతో కూడిన శాస్త్రీయ విద్య అందించినట్లయితే విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందుతుందన్నారు. హెచ్‌ఎం కోటేశ్వరరావు రఘునాథరావు, పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులందిస్తున్న సురేష్ చంద్రారెడ్డి

వరల్డ్‌కప్ వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మహిళల ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్‌కు చేరిన సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ప్రేక్షకుల వీక్షించేందుకు ఆదివారం బిగ్ లైవ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.పామర్రు: ఐసీసీ మహిళల ప్రపంచ కప్ ఫైనల్ పోటీల్లో భారత్ మహిళా క్రికెట్ జట్టు గెలిపొందాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా సోదరుడు చైతన్య అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం వర్లకుమార్‌రాజా ఆదేశాలమేరకు కూటమి శ్రేణులు ఉమెన్స్ వరల్డ్‌కప్ ప్రజలు వీక్షించేందుకు సౌకర్యంగా ఎల్ఈడీస్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా నాయకులు చాట్లర మేష్, జనసేన నేతలు కోప్పరాతి శ్రీకాంత్,సింహాద్రిక్రాంతి అభిమానులు వీక్షించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గుడివాడ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తట్టివర్రులోని రమణమహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరుడు, సాయిబాబా విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, గోమాతకు, ఉసిరి చెట్టు దగ్గర దీపారాధన నిర్వహించారు. పేదలకు మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్తీకవనసమారాధనకు హాజరైన వారికి మామిడి, జామ, తులసీ మొక్కలను అందజేశారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చేపల చెరువుల లీజునకు వేలం ప్రకటన

నందివాడ మండలంలోని రామాపురం పంచాయతీ నందు 3 సం ల కాలని దిగువ తెలిపిన పంచాయతీ కి సంబంధించిన చెరువులు లీజునకు వేలంపాట నిర్వహించబడును.

క.సం	వివరములు	విస్తీర్ణం (ఎ.లలో)	ధరావత్తు	కాలపరిమితి
1	కాలని చెరువు	3	రూ. 5000/-	మూడు సం.ములు
2	జానకిరామయ్య చెరువు	2.30		
3	రజకుల చెరువు	1.20		
4	SS TANKలో చేపలు ఉన్నవి ఉన్నట్టు పట్టుకొనుటకు	10.36		-

ఈ నెల 05 వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమక్షంలో జరిగే ఈ వేలంలో పాల్గొనవలయును.

సం/- యం. సుధీర్, కార్యదర్శి

మంటాడ శివాలయంలో చోరీ

పమిడిముక్కల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంటాడలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామి(శివాలయం)లో హుండీ పగులగొట్టి అందులోని కానుకలు దోచుకుపోయిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. మంటాడ-ఉయ్యూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయం తూర్పువైపు గేటు తాళం పగులగొట్టి ఆవరణలోకి ప్రవేశించి, స్టోర్‌రూమ్ తలుపు తాళం పగులగొట్టి అందులో ఉన్న గడ్డపొలుగు తీసుకుని ఆలయ ముఖద్వారం ఇనుపగ్రిల్లుకు ఉన్న తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న సొమ్ము తీసుకుపోయాడు. ఉదయం ఆలయం, పరిసరాలు శుభ్రపరిచేందుకు వచ్చిన మహిళకు ముఖద్వారం ఇనుపగ్రిల్లు తాళం లేకపోవడం చూసి లోనికి ప్రవేశించి చూడగా హుండీ తెరచి ఉండటం గమనించి సమీపంలో ఉన్న వాచ్‌మేన్‌కు సమాచారం అందించింది. దీంతో ఆలయ కమిటీకి ఆయన తెలియపరచి. చోరీ గురించి పమిడిముక్కల పోలీసులకు సమాచం ఇచ్చారు. ఎస్సై బి.శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్, డాగ్ టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించగా, పోలీసు శునకం గుడివద్దనుంచి సమీపంలో ఉన్న ఇటుకబట్టీల వరకు వెళ్లి ఆగిపోయింది. జూలై నెలలో హుండీ తెరచామని, అప్పటినుంచి భక్తులు వేసిన కానుకలు లక్ష రూపాయలకు పైగా ఉండవచ్చని కమిటీ తెలిపింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మంటాడ శివాలయంలో పగలగొట్టిన హుండీ

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య శిబిరం నిర్వాహకుడు ఈడ్పుగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకులు ఈడ్పుగంటి వెంకట్రామయ్య 10వ వర్థంతి సందర్భంగా స్థానిక ఈవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్యసేవలందించారు.గుండె నిపుణులు డాక్టర్ కర్నాటి రాజేంద్ర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : డాక్టర్ సీఎల్ వెంకట్రావు మెడికల్ సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. మానసిక సమస్యలకు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ హరిహరన్ పరీక్షలు నిర్వహించారు. గుండె కు సంబంధించిన వ్యాధులకు పోరంకి కామినేని హాస్పటల్స్ వారిచే వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ కి సంబంధించిన వ్యాధులకు డాక్టర్ సీఎల్ వెంకట్రావు వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గుడివాడ : స్థానిక కోతిబొమ్మసెంటర్‌లోని డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, మధుమేహానికి సంబంధించిన వైద్యులు వైద్యసేవలందించి ఉచితంగా మందులను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, పూర్వాధ్యక్షుడు టి.ఎస్ రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, శంకరరావు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ సి.సూర్యచంద్రరావు, రాఘవమ్మపాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పిన్నమనేని ఆసుపత్రి వైద్య సిబ్బంది



మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఓపెన్‌హౌస్‌లో వీనులవిందుగా పోలీసు బ్యాండు



మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీటాకీసు సెంటర్‌లో ఆదివారం రాత్రి పోలీసు కళాకారులు వివిధ వాయిద్యాలతో చేపట్టిన సంగీత విభావరి ప్రేక్షకులకు వీనుల విందు చేసింది. దేశభక్తి గేయాలను సాల్మన్‌రాజు గిటార్‌పై మీటి ప్రేక్షకులను మైమరపించారు.



ఘంటసాలలో తుఫానుకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పంటలకు కనపడని నష్టం : ఎమ్మెల్యే మండలి

ఘంటసాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. జోడుగూడెం వెళ్లేదారిలో ఉన్న టీడీపీ నేత, రైతు వేమూరి రమేష్ పంట పొలాన్ని సందర్శించారు. పాలు పోసుకునే దశలో ఈదురుగాలులతో కూడిన తుఫాన్ రావటంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరి నిలబడి ఉన్నప్పటికీ తాలు శాతం ఎక్కువ వచ్చి దిగుబడిలో తీవ్ర వ్యత్యాసం కనపడుతుందని రైతులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలు సడలించి నష్టం అంచనాలను రూపొందించాలని కోరారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్‌తో రైతుకు కనపడని నష్టం చేకూరిందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు బండి పరాత్పరరావు, విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, మొవ్వ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యోధా అవార్డులు అందుకున్న సౌజన్య కిరణ్మయి, నాగేంద్రబాబులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

సౌజన్య కిరణ్మయి, నాగేంద్రబాబుకు అభినందన

అవనిగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వేళ ధైర్యసాహసాలతో పని చేసి యోధ అవార్డులు సాధించిన కోడూరు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, అవనిగడ్డ గ్రామ సచివాలయం ఫిషరీష్ అసిస్టెంట్ లేబాక నాగేంద్రబాబులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం అభినందించి, ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తుఫాన్ సమయంలో అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పని చేశారని, వారిలో కోడూరు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఫిషరీష్ అసిస్టెంట్ లేబాక నాగేంద్రబాబు మరింతగా సేవలు అందించటం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు కృషి చేయాలని మండలి బుద్ధప్రసాద్ కోరారు. మండలి వెంకట్రామ్, లేబాక కొండలు పాల్గొన్నారు.



సువార్తమ్మ కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

నాగాయలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు టీడీపీ న్యాయం చేస్తుందని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పర్రచివర పంచాయతీ శివారు గణపేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాట్రగడ్డ సువార్తమ్మ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆమె భర్త బాబురావుకి రూ.5 లక్షలు చెక్కును కనపర్తి శ్రీనివాసరావు ఆదివారం ఇంటి వద్ద అందజేశారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాగాయలంక పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మంచాల తిరుపతి వరప్రసాద్, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మేడికొండ విజయ్, మంచాల మహేంద్ర, చిక్కాల జైపాల్, చాట్రగడ్డ లేలమ్మ, నీలా రాజేష్, సుబ్బారావు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పడవలను పరిశీలిస్తున్న మత్స్యకార నేతలు

మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టం సక్రమంగా అంచనా వేయాలి

నాగాయలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టాన్ని సక్రమంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపించాలని మత్స్యశాఖ అధికారులను మత్స్యకార నేతలు కోరారు. నాగాయలంక పడవల రేవులోని పడవలను ఆదివారం వారు పరిశీలించారు. వాస్తవంగా బోట్లు నష్టపోయిన మత్స్యకారుడికి జరిగేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘాల నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు వివాదంలో కత్తితో దాడి

కోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు వివాదంలో హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పిట్టలంక గ్రామపంచాయతీ శివారు బడేవారిపాలెంలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన అనుమకొండ వీరాంజనేయులు (దివ్యాంగుడు), అనుమకొండ వెంకటేశ్వరరావు అన్నదమ్ముల పిల్లలు. మొంథా తుపాను ప్రభావంతో ఇంటి సరిహద్దుల మధ్య ఉన్న చెట్ల కొమ్మలు అనుమకొండ వీరాంజనేయులు ఇంటి వైపు పడ్డాయని తెలుపగా, అనుమకొండ వెంకటేశ్వరరావు చెట్ల కొమ్మలను నరికాడు. వాటితోపాటు వెంకటేశ్వరరావు స్థలంలో ఉన్న చెట్లను కూడా నరకటంతో తన స్థలంలో ఉన్న చెట్లను ఎందుకు నరుకుతున్నావు అని అడిగిన వీరాంజనేయులును కత్తితో వెంకటేశ్వరరావు మెడపై గాయపర్చాడు. తలిదండ్రులు అతడిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు. వీరాంజనేయులుపై హత్యాయత్నం చేసిన అనుమకొండ వెంకటేశ్వరరావు అరెస్టును తప్పించుకునేందుకు అనారోగ్యంగా ఉందంటూ నాటకాలాడుతున్నాడని బాధిత కుటుంబం తెలిపింది.



కార్తీకమాసం, ఆదివారం కావడంతో మోపిదేవిలో భక్తుల రద్దీ



అశ్వారావుపాలెంలో హరినామ సంకీర్తన



పులిగడ్డ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

దివిసీమలో ఆధ్యాత్మిక శోభ

● సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు ● అశ్వారావుపాలెంలో అఖండ హరినామ సంకీర్తన ● పులిగడ్డ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

మోపిదేవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం, కార్తీక మాసం కావడంతో భక్తులతో పోటెత్తింది. నాగ పుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు అనేక ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరాగా, వివిధ సేవా రుసుములు ద్వారా ఒక్క రోజులోనే రూ.9,25,419 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. కాగా, మోపిదేవి పంచాయతీ శివారు మోపిదేవి వార్పు వద్ద బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చెట్టు వద్ద కార్తీక వనసమారాధన మహోత్సవం ఆదివారం జరిగింది. దేవుని చెట్టుగా ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంగణంలో పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది వనసమారాధనలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్ :** అశ్వారావుపాలెం కోదండ రామాలయంలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం 49వ రోజుకు చేరింది. అవధూతేంద్ర భక్తమండలి సమాజం ఆధ్వర్యంలో సంకీర్తన జరిగింది. రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది. మోదుమూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 50 రోజులుగా సప్తసప్తాహాలతో అఖండ హారతిని నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పులిగడ్డ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతచారి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావటంలో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. పాకలపాటి రామచంద్రరావు బ్రహ్మత్వంలో గుడివాక సాయి శ్రీనివాస్ - రత్నకుమారి దంపతులు పీటలమీద కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. దీవి నాగ సందీప్ - రాధ దంపతుల కుమార్తె అన్విక రెండో పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. **మచిలీపట్నం టౌన్ :** క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ప్రధాన ఆలయాల్లో ఆదివారం తులసి, ఉసిరిక వృక్షాలకు పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో దీపారాధనలు చేశారు. ఆకాశ దీపాలు వెలిగించారు.

లక్ష్మీపురం సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



చల్లపల్లి : కార్తీకమాసం సందర్భంగా లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కన్నులపండువగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు లక్ష బిల్వార్చన జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు విశేషపూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

క్రికెట్ సందడి

మచిలీపట్నం టౌన్ : వరల్డ్ కప్ మహిళా క్రికెట్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు కూడలి ప్రాంతాల్లో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులు మ్యాచ్‌ను తిలకిస్తూ కేరింతలు కొట్టారు. హసీంబేగ్ క్రీడాభిమానుల ఆనందంలో పాలుపంచుకున్నారు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి

జాతీయ లోక్ అదాలత్ డిసెంబరు 13న

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పూర్వపు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో సివిల్, కాంపౌండబుల్, క్రిమినల్ కేసులతో పాటు అన్ని రకాల కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

నాగాయలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సొర్లగొందిలో మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం, నిత్యావసరాలను టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అందజేశారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావుతో కొల్లాటి ధనుంజయ్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, నాయుడు, రామయ్య, పర్చూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మేడికొండ విజయ్, మంచాల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** రామకృష్ణాపురంలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశాఆరు. ఆదివారం పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అద్దంకి పాండురంగారావు తుపా న్ బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పంచదార పంపిణీ చేశారు.



సాయి మౌనికను సత్కరిస్తున్న హసీంబేగ్





ఆర్థిక సాయం, కళ్లజోళ్లు అందజేస్తున్న మానవత ప్రతినిధులు, సీఐ ఏసుబాబు

మానవత సేవలు మహోన్నతం

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడంలో మానవత స్వచ్ఛంద సంస్థ మహోన్నత సేవలందిస్తోందని ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 110 మంది వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. క్యాన్సర్, కిడ్నీ రోగులకు రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి. కిషోర్‌కుమార్ అధ్యక్షత వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ ఆధ్వర్యంలో యోధ అవార్డు అందుకున్న సాయిమౌనికను ఘనంగా సత్కరించారు. సాయిమౌనిక మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఇచ్చిన అవార్డు తనకెంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. మనుషుల ప్రాణాలతో పాటు పశువుల ప్రాణాలు రక్షించాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి అవార్డు దక్కడం సంతోషాన్ని కలిగించిందన్నారు. సేవా సంస్థ విద్యానిధి కన్వీనర్ పి. శ్రీరామ్, ఉపాధ్యక్షుడు బి. అ య్యప్ప స్వామి, అజీమ్, కరెడ్ల సుశీల, ఆదిత్య, ముంతాజ్ బేగం, డాక్టర్ మల్లిఖార్జునరావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనాలు నడిపే మైనర్లకు పోలీసుల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ చప్పిడి రాజా ఆధ్వర్యంలో మచిలీపట్నంలో వివిధ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడుపుతున్న 25 మంది మైనర్లకు జరిమానా విధించారు. కౌన్సెలింగ్ ఇచ్చి, చట్టాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ రాజు మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల జరిగిన రహదారి ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది యువకులే బలయ్యారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోటీల విజేతలు వీరే

పెడన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 26న నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతల పేర్లను ఎంఈవో ఎం. సలోమి ప్రకటించారు. తోటమూల హైస్కూల్ విద్యార్థిని పి.చాందిని, పెదతుమ్మిడి హైస్కూల్ విద్యార్థిని బి.సువర్షిక, చినపాండ్రాక హైస్కూల్‌కు చెందిన సఫా మెహెజబీన్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించినట్లు ఆమె వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కొక్కిలిగడ్డ రమేష్ మృతి

● జనసేన నాయకుల నివాళి

నాగాయలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండి గ్రామానికి చెందిన జనసేన నేత, అగ్నికుల క్షత్రియ నాయకుడు కొక్కిలిగడ్డ రమేష్ ఆదివారం మృతి చెందాడు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనలతో జనసేన నేతలు ఎదురుమొండి వెళ్లి జనసైనికుడు రమేష్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. మత్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, లంకే యుగంధర్, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, రేమాల మురళీ, అరజా కిరణ్ కాంత్ పాల్గొన్నారు.


250 మందికి వైద్యపరీక్షలు

మోపిదేవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలో కెనరా బ్యాంకు సమీపంలో రేపల్లెకు చెందిన ఆరుష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్.అశోక్ కుమార్, లలిత, వైష్ణవి 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, పీఏసీఎస్ ఛైర్మన్ నాదెండ్ల శరత్‌చంద్ర ప్రసాద్, బల్ల సీతారామ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముప్పాల యేసు, జొకిపర్తి బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడుకు టీడీపీ శ్రేణుల ఘన నివాళి

అవనిగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో వర్ధంతిని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రన్నాయుడుకు టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. కనపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, షేక్ బాబావలి, దాసినేని శ్రీనివాసరావు, మేడికొండ విజయ్, కమ్మిలి సుబ్రహ్మణ్యం, మెరుగు సోమిరెడ్డి, రంగనాథ్, కొండవీటి గోవింద్, కోట సాయి తదితరులు నివాళులర్పించారు.

కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్‌కు మాతృవియోగం



అంజనాదేవి (ఫైల్)

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు మాతృమూర్తి తలుపుల అంజనాదేవి (85) గూడూరులో మృతి చెందారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పార్థివదేహాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్, జనసేన నాయకులు గరికపాటి శివ, కొరియర్ శ్రీను, బత్తిన హరిరామ్, కనపర్తి వెంకన్న, గండ్రం సర్పంచ్ గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, లింగం విజయ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సందర్శించి నివాళులర్పించారు.

శంకరమఠంలో లింగధారణ నేడు

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శంకరమఠంలో సోమవారం లింగధారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మచిలీపట్నం శైవమహాపీఠం కార్యదర్శి మల్లంపల్లి కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు బ్రాహ్మణులైన శైవులకు లింగధారణ చేస్తున్నామని, సోమవారం వైశ్యులకు, విశ్వబ్రాహ్మణులకు లింగధారణ చేస్తామన్నారు ఈ అవకాశాన్ని శైవులు వినియోగించుకోవాలని కోరారు.



స్కాలర్‌షిప్ పంపిణీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 15 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. శ్రీపాద ఫంక్షన్ హాలులో సరస్వతీ పథకం కింద మంది విద్యార్థులకు రూ.1000 చొప్పున అందజేశారు. ఎస్. రేణుకారాణి, శిరీష, ఏ. అశోక్, జె. దివ్యశ్రీ, వి.కె.ఎన్. మూర్తి, రంగనాయకులు, ప్రసాద్, శ్రీదేవి, మధుసూధనప్రసాద్, భాస్క ర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగాయలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరంలో శనివారం అర్ధరాత్రి పేకాటరాయుళ్లను ఎస్సై కె.రాజేష్ అరెస్టు చేసి, రూ.7300 స్వాధీనం చేసుకున్నారు.

లైఫ్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు నవంబరు 3లోగా లైఫ్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.వి.ఈశ్వరరావు, కార్యదర్శి బి.కోటేశ్వరరావు తెలిపారు. సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ నాయకులు మీడియాతో మాట్లాడారు. పీపీవో నెంబరు, ఆధార్ జెరాక్స్, బ్యాంకు అకౌంట్ నెంబర్ జెరాక్స్ కాపీలు ఇస్తే సేవలందిస్తామన్నారు.